

కానరాని నిబంధనలు..

బాణాసంచా విక్రయ కేంద్రాల వద్ద నిబంధనలు పాటించం లేదనే విమర్శలు ఉన్నాయి. తయారీ కేంద్రాలు బలంగా ఉండాలి. మంటలు చెలరేగితే ఆర్పేలా సంబంధిత పరికరాలు సిద్ధంగా ఉంచుకోవాలి. 25వేల లీటర్ల నీటి సామర్థ్యంతో ఒక సంపు నిర్మించుకోవాలి. డీజిల్, ఇంజను, కార్బన్‌డయాక్సైడ్, ఆక్సిజన్ సిలెండర్లు, పొడి ఇసుకను ఒక డ్రమ్ములో నింపి ఉంచాలి. 15 కిలోలకు మించి మందుగుండు సామగ్రి, నలుగురుకు మించి కూలీలు ఉండకూడదు. అయితే ఇవెక్కడా తయరీ కేంద్రాలు, విక్రయాల వద్ద కనిపించడం లేదు.

బాణసంచా ధరలు పేలుతున్నాయ్





- చుక్కలనంటుతున్న మందుగుండ సామగ్రి రేట్లు
- శ్రీకాకుళంలో 22 తాత్కాలిక దుకాణాలు
- ప్రతి మండల కేంద్రంలో వెలుస్తున్న షాపులు
- తయారీ, విక్రయ కేంద్రాల వద్ద కానరాని నిబంధనలు

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ వేళ.. జిల్లావ్యాప్తంగా బాణసంచా దుకాణాలు ఏర్పాటవుతున్నాయి. శాశ్వత లైసెన్స్ ఉన్న దుకాణాల్లో బాణసంచా విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. తాత్కాలిక అనుమతి పొందినవారు దుకాణాలు ఏర్పాటు చేసి.. విక్రయాలకు సిద్ధమవుతున్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం 270 వస్తువులపై జీఎస్టీ తగ్గించింది. కానీ జాబితాలో బాణసంచా లేదు. బాణసంచా సామగ్రిపై 18శాతం జీఎస్టీ కొనసాగుతోంది. ఈ మేరకు ధరలు గత ఏడాది మాదిరిగా ఉండాలి. కానీ ఈ ఏడాది ధరలు టపాసుల్లా పేలుతున్నాయి. గతేడాదితో పోల్చితే 20శాతం వరకు ధరలు పెరిగాయని వ్యాపారులు, కొనుగోలుదారులు చెబుతున్నారు. బాణసంచా విక్రయ కేంద్రాల్లో టపాసుల ధరలను చూసి సామాన్య మధ్య తరగతి ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. కాకర పువ్వొత్తులు సాధారకం రూ.150, కలర్స్ అయితే రూ.200, భూచక్రాల సైజు, కంపెనీలను బట్టి ప్యాకెట్ రూ.50 నుంచి రూ.150 పలుకుతోంది. హండ్రెడ్ వాలా టపాసులు రూ.30-50, విష్ణుచక్రాల బాక్సు రూ.200 నుంచి రూ.250కు విక్రయిస్తున్నారు. చిచ్చుబుడ్లు మట్టితో చేసినవి ఒకటి రూ.30, కంపెనీల చిచ్చుబుడ్లు చిన్నవి బాక్సు రూ.100 నుంచి రూ.200వరకు అమ్మకాలు జరుగుతున్నాయి. గత ఏడాది లక్ష్మీ బాంబుల కట్ట(10) రూ.200 ఉండగా ఈ ఏడాది రూ.600 పలుకుతోంది. తక్కువ నాణ్యతకు చెందిన క్రాకర్లు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. బాణసంచా విక్రయాలకు సంబంధించి లైసెన్స్ నెంబర్, టిన్ నెంబర్‌తో ఉన్న రశీదుపై బిల్లులు ఇవ్వాలి. కానీ తెల్లకాగితంపై బిల్లురాసి

(మిగతా 9వ పేజీలో..)

నిబంధనలు పాటించాలి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

టెక్కలి/జలుమూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బాణసంచా దుకాణాల ఏర్పాటులో నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ హెచ్చరించారు. దుకాణాల వద్ద పటిష్ఠ భద్రత, జాగ్రత్తలు తప్పనిసరిగా చేపట్టాలని తెలిపారు. శనివారం సాయంత్రం టెక్కలిలో దీపావళి సామగ్రి దుకాణాలను పరిశీలించారు. అలాగే జలుమూరు మండలం చల్లవానిపేట కూడలి సమీపంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. హరికృష్ణమ్మపేట వద్ద ప్రభుత్వ అనుమతితో ఏర్పాటు చేసిన దుకాణానికి సమీపంలో మరో షాపు ఏర్పాటు నిబంధనలకు విరుద్ధమన్నారు. చల్లవానిపేట కూడలిలో దుకాణాన్ని మార్పు చేయాలని తహసీల్దార్ రామారావుకు ఆదేశించారు. అలాగే టెక్కలిలో చేపడుతున్న ప్రత్యేక పారిశుధ్య నిర్వహణ పనులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, తహసీల్దార్ సత్యం, ఎంపీడీవో రేణుక, పంచాయతీ ఈవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.



టెక్కలిలో బాణసంచా దుకాణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విక్రయాలకు అనుమతి తప్పనిసరి

- ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా బాణ సంచా విక్రయిస్తే చర్యలు తప్పవని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి స్పష్టం చేశారు. బాణసంచా తయారీ, విక్రయ కేంద్రాల వద్ద నిబంధ నలు పాటించాలని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నివాస ప్రాంతాలకు దూరంగా బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేయాలి. దుకాణాల మధ్య కనీసం మూడు అడుగుల దూరం పాటించాలి. ప్రమాదాలు జరగ కుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇసుక, నీరు అందుబాటులో ఉంచాలి. బాణసంచా నిల్వ ఉంచినా, అక్రమంగా రవాణా చేసినా, లైసెన్స్ లేకుండా విక్రయించినా చర్యలు తప్పవు. జిల్లా వాసులు పర్యావరణహిత దీపావళి జరుపుకోవాలి. రాత్రి పది గంటల తర్వాత జిల్లాలో బాణసంచా కాల్చడం నిషేధం. తక్కువ కాలుష్యం ఉన్న గ్రీన్ క్రాకర్స్‌ను వినియోగించాలని ఎస్పీ సూచించారు.

స్వచ్ఛత.. నిరంతర ప్రక్రియ

- సిక్కోలును కాలుష్యరహితంగా తీర్చిదిద్దుతాం
- సైకిల్ వినియోగం పెరగాలి
- ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి
- కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు



అరసవల్లిలో పరిసరాలను శుభ్రం చేస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులు

అరసవల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): 'మన ఇంటిని, పరిసరాలను, సమాజాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలి. స్వచ్ఛత అనేది నిరంతర ప్రక్రియ' అని కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. సిక్కోలును కాలుష్య రహితంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. శనివారం అరసవల్లిలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి 'స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛభారత్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదిత్యుడి ఆలయ పరిసరాలు, ఇంద్రపుష్కరిణి వెనుక, ఖాజీపేట రోడ్డులో పరిసరాలను శుభ్రం చేశారు. రోడ్డును ఆనుకుని ఒక మొక్కను నాటారు. కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ 'రాష్ట్రవ్యాప్తంగా ప్రతీ నెల మూడవ శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తూ లక్ష్య సాధన దిశగా సాగుతున్నాం. జిల్లాలో స్వచ్ఛమైన వాతావరణం కోసం 25లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించాం. ఆ లక్ష్యాన్ని చేరుకున్నందుకు ఆనందంగా ఉంది. వాతావరణ కాలుష్యాన్ని నివారించేందుకు అందరూ బాధ్యత తీసుకోవాలి. సైకిల్ వినియోగం పెరగాలి. నగరంలో వీలైనంత వరకు రోడ్డుపక్కన సైకిలు ట్రాక్‌లు ఏర్పాటు చేస్తాం. ఆదివారాన్ని సైకిల్‌డే గా మార్చుకోవాలి. స్వచ్ఛతా హీ సేవలో జిల్లాను దేశంలోనే టాప్ టెన్ నగరాల్లో ఒకటిగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అందరం కృషి చేద్దాం. ప్రధాని మోదీ పిలుపు మేరకు ప్రతీ ఒక్కరూ తమ తల్లి పేరిట ఒక మొక్కను నాటి సంరక్షించాలి. మన ఇళ్లల్లో జరిగే శుభకార్యాలను సైతం పర్యావరణహితంగా నిర్వహించాలి. విశాఖకు గూగుల్ రావడం చారిత్రాత్మకం. ఈ విషయంలో కూడా కొందరు విమర్శలు చేస్తుండడం బాధాకరం. ఇండస్ట్రియల్ హబ్‌గా మారడం ద్వారా పవర్ ఇండస్ట్రీ, ఆహార పరిశ్రమలు, టూరిజం ఎంతో అభివృద్ధి చెందుతాయి. తద్వారా 1.88 లక్షల మందికి ఉపాధి లభిస్తుంది. పలాసలో విమానాశ్రయ ఏర్పాటు కోసం అందరికీ న్యాయం చేసేలా ముందుకు వెళతామ'ని తెలిపారు. కార్పొరేషన్ కమిషనర్ పీవీవీడీ ప్రసాదరావు, అరసవల్లి ఈవో కేఎన్‌వీడీవీ ప్రసాద్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరి వరప్రసాద్ పాల్గొన్నారు.

రూ.1కే ఇంటి ప్లాన్



పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ ఏరియా వ్యూ..

- 50 చదరపు గజాల్లో నిర్మించేలా ప్రణాళిక
- అవగాహన లేక ముందుకు రాని నిర్మాణదారులు
- పట్టించుకోని ప్రైవేటు ప్లానింగ్ నిర్వాహకులు

పలాస, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణాలు, నగరాల్లో పేద, మధ్యతరగతి ప్రజల సొంతింటి కల సాకారం చేసుకునేలా.. రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయికే ఇంటి నిర్మాణ అనుమతులకు అవకాశం కల్పించింది. 50 చదరపు గజాల స్థలంలో ఇల్లు కట్టుకోవడానికి భారీ రాయితీ ఇచ్చింది. కేవలం రూ.1 చెల్లిస్తే చాలు అటువంటి నిర్మాణదారులు.. అనుమతులు తక్షణం పొందవచ్చు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం, టౌన్‌ప్లానింగ్ అధికారులు, పట్టణాభివృద్ధి సంస్థ ప్రచారాలు కల్పించినా అవగాహన లేకపోవడంతో భవన నిర్మాణదారులు ప్లాన్ అనుమతులకు ఇప్పటివరకూ దరఖాస్తులు చేసుకోలేకపోయారు. ఇంటిప్లాన్‌లకు అనుమతులిచ్చే లైసెన్స్ టౌన్‌ప్లానర్లు దీనిపై తమకు ఎటువంటి డబ్బులు రావని నిర్మాణదారులకు మొండిచేయి చూపిస్తున్నారు.

- గతంలో ఇంటి నిర్మాణానికి సంబంధించి టౌన్‌ప్లానింగ్ సిబ్బంది సహాయంతోపాటు ప్రైవేటు లైసెన్స్ టౌన్ ప్లానర్ల ద్వారా అనుమతి తీసుకునేవారు. దీనికి కనీసం రూ.20వేల నుంచి రూ.50వేలు, పెద్ద భవనాలయితే రూ.1లక్ష వరకూ ప్రభుత్వానికి చలానా రూపంలో నగదు చెల్లించేవారు. దీనికి తోడుగా టౌన్‌ప్లానింగ్ సిబ్బందికి భారీగా ముడుపులు ఇవ్వనిదే అనుమతి వచ్చే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో, పేద, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్టు కూటమి ప్రభుత్వం గుర్తించింది. కొంతమందికైనా వెసులుబాటు కల్పించాలనే ఉద్దేశంతో ఇటీవల పట్టణాభివృద్ధిశాఖ మంత్రి కె.నారాయణ మంత్రివర్గంతో చర్చించారు. 50 చదరపు గజాల వ్యాసంలో ఉన్న ఇళ్లకు రూ.1కే ప్లాన్ అనుమతి ఇచ్చేలా ఉత్తర్వులు ఇచ్చారు. ఈ మేరకు ఇంటి నిర్మాణదారులు ప్లానింగ్ కోసం ఇంటిస్థలం పత్రాలు, ఆధార్, రేషన్ కార్డును ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి. రూ.1 ఫీజు చెల్లిస్తే చాలు.. మొత్తం అనుమతులన్నీ సకాలంలో లభిస్తాయి. ఒక్కో నిర్మాణదారుడు జీ ప్లస్ (రెండు అంతస్తులు) వరకూ నిర్మాణం చేసుకోవచ్చు. ఇందుకు సంబంధించి కొన్ని మునిసిపాలిటీలు, పట్టణాభివృద్ధి సంస్థల్లో దరఖాస్తు చేసుకోగా వారికి అనుమతులు లభించాయి. జిల్లాలో మాత్రం ఇప్పటివరకూ ఈ పథకాన్ని ఎవరూ ఇంకా వినియోగించుకున్న దాఖలాలు కనిపించడం లేదు. శ్రీకాకుళం కార్పొరేషన్, ఆమదాలవలస, పలాస-కాశీబుగ్గ, ఇచ్ఛాపురం మునిసిపాలిటీల్లో ఇంకా ఈ పథకం ప్రారంభమే కాలేదు. నిత్యం టెలీకాన్ఫరెన్స్, వీడియో కాన్ఫరెన్స్‌ల్లో అధికారులు రూ.1కే టౌన్‌ప్లానింగ్ అనుమతిపై ఒత్తిడి చేస్తున్నా.. ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న మాదిరిగా వ్యవహారం నడుస్తోంది. దీనివల్ల శాఖాపరంగా కూడా ఎటువంటి లాభాలు లేకపోవడంతో కొంతమంది ఆసక్తి చూపించడం లేదు. అధికారులు మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

అవగాహన కల్పిస్తాం..

కూటమి ప్రభుత్వం రూ.1కే ఇంటి నిర్మాణ అనుమతులకు ఆదేశించింది. ఇప్పటివరకూ ఒక్క దరఖాస్తు కూడా మాకు రాలేదు. దీనిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తాం. నిర్మాణ అనుమతులకు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటాం. లైసెన్స్ టౌన్‌ప్లానర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తున్నాం. సాధారణ ఇళ్లతో పాటు రూపాయికే రిజిస్ట్రేషన్ ఇళ్లను కూడా తప్పనిసరి చేయడానికి చర్యలు తీసుకుంటాం.

-ఎన్.రామారావు, కమిషనర్, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ

మూడు పీఏసీఎస్‌లకు చైర్మన్లు, సభ్యుల నియామకం

శ్రీకాకుళం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కోటబొమ్మాళి, నందిగాం మండలాల పరిధిలో మూడు పీఏసీఎస్‌లకు చైర్మన్లు, సభ్యులను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు శనివారం వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి బి.రాజశేఖర్ ఉత్తర్వులు విడుదల చేశారు. కోటబొమ్మాళి పీఏసీఎస్ చైర్మన్‌గా వెలమల విజయలక్ష్మి, సభ్యులుగా ఎస్.ఆనందరావు, ఎస్.రామకుమార్, తెంబూరు పీఏసీఎస్ చైర్మన్‌గా పోలాకి చంద్రశేఖరరావు, సభ్యులుగా బెండి జగదీష్, మద్దిల అనంతయ్య, దిమిలాడ పీఏసీఎస్ చైర్మన్‌గా పినకాన అజయ్‌కుమార్, సభ్యులుగా పి.ఉమాపతి, పి.వీరాస్వామి నియమితులయ్యారు. వారిని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు అభినందించారు. వారంతా తమ సేవలను గుర్తించి పీఏసీఎస్ చైర్మన్‌లుగా, సభ్యులుగా నియామకానికి కృషిచేసిన మంత్రి అచ్చెన్నాయుడుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రైతులకు సకాలంలో రుణాలు, విత్తనాలు అందేలా కృషి చేస్తామని వెల్లడించారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి జేఏ మౌలానా

పేదలకు న్యాయసేవలు అందించాలి

- జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా

9లో





ఆకట్టుకున్న నృత్యప్రదర్శనలు

సిక్కోలు ఉత్సవ్ విజయవంతం

- ఆకట్టుకున్న సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ ఎగ్జిబిషన్
- ప్రత్యేక ఆకర్షణగా ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు

9లో

వాకింగ్‌కు వెళ్లి వస్తూ ...

- శ్రీకాకుళంలో బస్సు ఢీకొని వ్యక్తి దుర్మరణం

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

అమ్మోనియం ట్యాంకర్ బోల్తా

8లో

ఇసుక ట్రాక్టర్లు తప్పించుకుపోయాయి

- పట్టుకున్నవి 7.. ఉన్నవి 4 వాహనాలు
- అందులో రెండు విడిచిపెట్టేసిన వైనం
- తహసీల్దార్ కార్యాలయం ఆవరణలోనే మాయం

హిరమండలం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమంగా తరలిస్తున్న ఏడు ట్రాక్టర్లను అధికారులు పట్టుకోగా.. అందులో మూడు వాహనాలు తప్పించుకుపోయాయి. తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఉంచిన ఒడిశాకు చెందిన మూడు ట్రాక్టర్లు తీసుకెళ్లిపోవడం చర్చనీయాంశంగా మారింది. ఈ విషయమై తహసీల్దార్ వద్ద ప్రస్తావించగా.. అవి ఒడిశా రాష్ట్రానికి చెందినవి కావడంతో పట్టుకోవాలని పోలీసులకు సమాచారం ఇచ్చామని చెప్పడం గమనార్హం. వివరాలోకి వెళితే.. హిరమండలంలోని గొట్టాబ్యారేజీ దిగువన మెట్టతోట సమీపంలో వంశధార నది నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న ఏడు ట్రాక్టర్లను పోలీసుల సహకారంతో వీఆర్వోలు పట్టుకున్నారు. శనివారం మధ్యాహ్నం 12గంటల సమయంలో వాటిని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. అందులో నాలుగు ట్రాక్టర్లు హిరమండలం మండలంలోని ధనుపురం గ్రామానికి చెందినవి. మిగిలినవి ఒడిశా రాష్ట్రానికి చెందినవి. సాయంత్రం 6.30 గంటల సమయంలో ఒడిశాకు చెందిన మూడు ట్రాక్టర్లను తప్పించుకుపోయారు. తహసీల్దార్ జోగారావు, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది కార్యాలయంలో ఉంటుండగానే ఆ ట్రాక్టర్లు తీసుకెళ్లిపోవడం గమనార్హం. ఈ విషయం తెలిసి తహసీల్దార్ ఖంగుతిన్నారు. వెంటనే ఎస్ఐ వెంకటేష్‌కు ఫోన్ చేశారు. మధ్యాహ్నం పట్టుకున్న మూడు ట్రాక్టర్లను కార్యాలయం ఆవరణ నుంచి తీసుకెళ్లిపోయారని, వాటిని పట్టుకోవాలని చెప్పారు. అప్పటికే ట్రాక్టర్లు చాలా దూరం వెళ్లి పోయి ఉంటాయని మిగతా ట్రాక్టర్ల డ్రైవర్లు చెప్పారు. పోలీసులు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి.. తప్పించుకుపోయిన ట్రాక్టర్లు నెంబర్లు ఇస్తే పట్టుకోవడానికి ప్రయత్నిస్తామన్నారు. దీనిపై తహసీల్దార్ వద్ద ప్రస్తావించగా.. ఒడిశాకు చెందిన మూడు ట్రాక్టర్లు తప్పించుకుపోయినట్టు పోలీసులకు సమాచారమిచ్చామని తెలిపారు.

ట్రాక్టర్లు విడిచిపెట్టడంపై వివాదం

ధనుపురం గ్రామానికి చెందిన నాలుగు ట్రాక్టర్లలో రెండింటిని తహసీల్దారు విడిచిపెట్టడంపై వివాదం నెలకొంది. నదిలో ట్రాక్టర్లను పట్టుకున్న సమయంలో రెండు ఇసుక లోడ్ చేసినవి కాగా, మిగతా రెండు ఖాళీ ట్రాక్టర్లు. వాటిలో రెండు ఖాళీ ట్రాక్టర్లును రాత్రి 8గంటల సమయంలో విడిచిపెట్టి ఇసుక లోడ్‌తో ఉన్న ట్రాక్టర్లును కార్యాలయంలోనే ఉంచడంపై విమర్శలు వెల్లువెత్తాయి. అధికారపార్టీ నాయకులు ఫోన్ చేయడంతో తహసీల్దారు ఖాళీగా ఉన్న ట్రాక్టర్లును విడిచి పెట్టారని మిగిలిన ఇద్దరు డ్రైవర్లు ఆరోపిస్తున్నారు. అన్ని ట్రాక్టర్లు విడిచి పెట్టాలని.. లేదంటే అన్నింటిపైనా చర్యలు తీసుకోవాలని.. ఇదెక్కడి న్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు.



తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఉన్న నాలుగు ట్రాక్టర్లు

అందరికీ ఉపాధి కల్పించడమే ధ్యేయం

కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ● వివిధ అభివృద్ధి పనులు ప్రారంభం


సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు

జలుమూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): చదువుకున్న వారందరికీ స్థానికంగా ఉపాధి కల్పించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయంగా పని చేస్తున్నట్లు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు తెలిపారు. అల్లాడ ఎల్.కె.రోడ్డు నుంచి పారశెల్లి మీదుగా రెల్లివలస వరకు రూ.3.20 కోట్ల ఉపాధి నిధులతో నిర్మించిన బీటీరోడ్డును శనివారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంజనీరింగ్ చేసిన వారికి ఉపాధి కల్పించడానికి పలాసలో ఎయిర్‌పోర్ట్, మూలపేటలో పోర్టు నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఉన్నత చదువులు పూర్తి చేసిన వారికి స్థానికంగా ఉద్యోగావకాశాలు కల్పించడానికి జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఐటీశాఖ మంత్రి నారా లోకేష్ చొరవతో విశాఖపట్నంలో పెట్టుబడులు పెట్టడానికి అనేక కంపెనీలు ముందుకు వస్తున్నాయన్నారు. గూగుల్ కంపెనీ విశాఖలో రూ.1.35 వేల కోట్లు పెట్టుబడులు పెట్టడానికి రావడం ఉత్తరాంధ్ర ప్రజల అదృష్టమన్నారు. అభివృద్ధి పనులు చూసి ఓర్వలేని వైసీపీ రెడ్ బుక్ కథలు చెబుతోందని అన్నారు. వాటిని ప్రజలు నమ్మవద్దని కోరారు. అల్లాడ శ్రీవేంకటేశ్వరాలయం వద్ద కల్యాణ మండపం నిర్మాణానికి నిధులు మంజూరుకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, టీడీపీ నియోజకవర్గం సమన్వయకర్త బగ్గు అర్చన, శ్రీకాకుళం ఆర్డీవో కె.సాయిప్రత్యూష, తహసీల్దారు జె.రామారావు, ఇన్‌చార్జి ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, టీడీపీ నాయకులు దాసునాయుడు, కింజరాపు సత్యం, వెలమల రాజేంద్రనాయుడు, బగ్గు గోవిందరావు, సనపల రమణ, జెడ్పీటీసీ ప్రతినిధి మెండ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పార్కు ప్రారంభం..

నరసన్నపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నరసన్నపేట మండలం పారసెల్లి గ్రామంలో సీసీ రోడ్డు, చిల్డ్రన్ పార్కును కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు ప్రారంభించారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ప్రజలకు అండగా ఉంటుందని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి

జలుమూరు (సారవకోట), అక్టోబరు 18: కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని కేంద్రమంత్రివర్యులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. సవర మాళువ నుంచి మాళువ వరకు నిర్మించిన సిమెంటు రోడ్డును శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని సంక్షేమంతో పాటు అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. ప్రధానమంత్రి మోదీ సహాయ సహకారాలు అందిస్తుండడంతో రాష్ట్రం అభివృద్ధిలో పరుగులు తీస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, తహసీల్దారు విజయలక్ష్మి, ఎంపీడీవో మోహన్‌కుమార్, నియోజవవర్గ ఇన్‌చార్జి బగ్గు అర్చన, ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ప్రతినిధి ధర్మాన తేజకుమార్, సారవకోట సొసైటీ అధ్యక్షులు సురవరపు తిరుపతిరావు, మండల టీడీపీ అధ్యక్షులు కత్తిరి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ

సిమ్మెంటు రోడ్డు ప్రారంభానికి మాళువ వెళ్లిన కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు.. ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు వర్గం ఆహ్వానం మేరకు సర్పంచ్ నక్క రాజు ఇంటికి వెళ్లారు. దీంతో టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ప్రతినిధి వర్గం అభ్యంతరం తెలిపారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో కేంద్ర మంత్రి జోక్యం చేసుకొని...వివాదం సద్దుమణిగేలా చేశారు.

క్రైం కార్నర్

వాకింగ్‌కు వెళ్లి వస్తూ ...

శ్రీకాకుళంలో బస్సు ఢీకొని వ్యక్తి మృతి


సత్యనారాయణ (ఫైల్)

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అంబేడ్కర్ కూడలి సమీపంలో ఆర్టీసీ బస్సు ఢీకొని స్కూటీపై వెళుతున్న వంకదార సత్యనారాయణ (64) మృతిచెందాడు. స్థానికులు, ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని పీఎస్ఎన్ఎం స్కూల్ సమీపంలోని రాధాకృష్ణనగర్ కాలనీలో నివాసం ఉంటున్న వంకదార సత్యనారాయణ శనివారం ఉదయం ఆర్ట్స్ కళాశాల మైదానానికి వాకింగ్‌కు వెళ్లారు. వాకింగ్ పూర్తి చేసుకొని తిరిగి ఇంటికి వెళుతున్న సమయంలో అంబేడ్కర్ జంక్షన్ వద్ద డే అండ్ నైట్ జంక్షన్ వైపు వెళ్లేందుకు ఒక్కసారిగా తన స్కూటీని తిప్పాడు. శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వెళ్లేందుకు అప్పుడే బయలుదేరిన ఆర్టీసీ బస్సు అంబేడ్కర్ జంక్షన్ దాటే సమయంలో ఒక్కసారిగా స్కూటీపై వెళుతున్న సత్యనారాయణపై నుంచి దూసుకెళ్లింది. ఆయన బస్సు కింద పడిపోవడంతో వెనుక చక్రం తలపై నుంచి వెళ్లింది. దీంతో తల నుజ్జునుజ్జయి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. స్థానికులు సమాచారం మేరకు ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతుడు సత్యనారాయణ ఫోన్ ద్వారా అతని కుమారులకు సమాచారం అందించారు. సత్యనారాయణ కొన్నేళ్లుగా శ్రీకాకుళంలో బిల్డర్‌గా పనిచేస్తున్నారు. "మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించి ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


వసంత్‌కుమార్ (ఫైల్)

ఇచ్ఛాపురం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పత్తిపాడు జంక్షన్ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇచ్ఛాపురం మండలం లొద్దపుట్టి గ్రామానికి చెందిన యువ ఇంజనీర్ పిట్ట వసంత్ కుమార్(32) మృతి చెందగా.. అతని భార్య సంధ్య తీవ్ర గాయాలతో సమీపంలో గల ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతోంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బెల్లుపడ గ్రామానికి చెందిన బడే ఆదినారాయణ, చంద్రమ్మల కుమార్తె సంధ్యకు లొద్దపుట్టి గ్రామానికి చెందిన పిట్ట మోహన్‌రావు, కుమారిల కుమారుడు పిట్ట వసంత కుమార్‌తో 8 నెలల కిందట వివాహమైంది. వసంత కుమార్ నూజివీడులో సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. శని, ఆది రెండు రోజులు సెలవు కావటంతో భార్యని అరకు తీసుకెళ్లేందుకు ద్విచక్ర వాహనంపై శనివారం బయలుదేరాడు. పత్తిపాడు వద్దకు వచ్చేసరికి రహదారి పక్కనే ఆగి ఉన్న లారీని ఢీకొట్టారుఉ. దీంతో కింద పడిన భార్యాభర్తలకు తలపై తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వచ్చి చూసే సరికి వసంత్ కుమార్ మృతి చెంది ఉన్నాడు. సంధ్యను సమీపంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉంది. దీంతో అటు లొద్దపుట్టిలో, ఇటు ఇచ్ఛాపురంలో విషాదఛాయలు అలముకున్నాయి.

అమ్మోనియం ట్యాంకర్ బోల్తా


బోల్తాపడిన అమ్మోనియం ట్యాంకర్

కోటబొమ్మాళి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం నుంచి విశాఖపట్నం వైపు అమ్మోనియంను తీసుకువెళుతున్న ట్యాంకర్ జర్జంగి వద్ద శనివారం తెల్లవారు జామున డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. నేషనల్ హైవే సిబ్బంది స్థానిక పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వటంతో వారు సహాయ చర్యలు చేపట్టారు. అమ్మోనియం లీకై పేలిపోతుందనే భయంతో సమీపంలో ఉన్న గ్రామస్థులు ఇళ్లు వదిలి బయటకు పరుగులు తీశారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సుమారు రెండు గంటల పాటు శ్రమించి ట్యాంకర్ నుంచి అమోనియం లీకేజీ కాకుండా చర్యలు తీసుకున్నారు. అనంతరం దానిని అక్కడి నుంచి తరలించారు. ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. డ్రైవర్ నిద్రలోకి జారుకోవడంతో ఈ సంఘటన చోటు చేసుకుందని... ఎవరికీ ఎటువంటి నష్టం జరుగలేదని పోలీసులు తెలిపారు.

రూ.5లక్షల బాణసంచా స్వాధీనం


బాణసంచాను పరిశీలిస్తున్న పోలీసులు

పలాస, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గలోని ఓ ఇంటిలో ఎటువంటి అనుమతులు లేకుండా నిల్వ ఉంచిన రూ.5 లక్షల విలువైన దీపావళి బాణసంచాను కాశీబుగ్గ పోలీసులు శుక్రవారం అర్ధరాత్రి పట్టుకున్నారు. వాటిని స్వాధీనం చేసుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు. పి.జగదీష్ అనే వ్యాపారి ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడిలో మందుగుండు సామగ్రి కొనుగోలు చేసుకొని అనుమతులు లేకుండా విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. సీఐ పి.సూర్యనారాయణ, సిబ్బంది మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేతనదారులందరికీ ఉపాధి

ఎల్.ఎన్.పేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వేతనదారులందరికీ నిబంధనల ప్రకారం ఉపాధి పనులు కల్పించేలా ప్రణాళికలను రూపొందించాలని ఏపీడీ పి.రాధ తెలిపారు. మండల కేంద్రంలోని ఉపాధి హామీ పథకం కార్యాలయంలో శనివారం టెక్నికల్ అసిస్టెంట్లతో జరిగిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఏపీవో శ్రీదేవి, ఈసీ సింహాద్రి, టెక్నికల్ అసిస్టెంట్లు మన్మథరావు, లక్ష్మణరావు, సూర్యారావు, నాయుడు, రాధిక తదితరులు పాల్గొన్నారు.

సూర్యఘర్ పథకాన్ని వినియోగించుకోండి

నరసన్నపేట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): సూర్యఘర్ పథకాన్ని అందరూ వినియోగించుకోవాలని ఈపీడీసీఎల్ డీఈఈలు వై.శ్రీధర్‌కుమార్, జీవీ సురేష్‌లు సూచించారు. శనివారం స్థానిక ఎమ్పీడీవో కార్యాలయ ఆవరణలో గ్రీన్ ఎనర్జీ సొల్యూషన్, ఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో సూర్యఘర్ పథకంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలాకి ఏఈఈ శ్రీనివాసరావు, ఉర్లాం ఏఈఈ బాలకృష్ణ, జేఈవో డి.శేఖర్, జేఈ రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో వాహనదారులకు మేలు

పాతపట్నం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో వాహన ధరలు గణనీయంగా తగ్గుతాయని ఎంవీఐ వై.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక విజ్ఞాన్ స్కూల్‌లో జీఎస్టీ తగ్గింపుపై శనివారం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. లక్కీడిప్ నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అంతకుముందు ద్విచక్ర వాహనదారులతో ర్యాలీ నిర్వహించారు.

నరసన్నపేటలో...

నరసన్నపేట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0 సంస్కరణలతో ద్విచక్ర వాహనాల ధరలు తగ్గుముఖం పట్టాయని రాష్ట్ర పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఏఎస్‌వీ ప్రసాద్, టెక్కలి మెటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ డి.సంజీవిరావు అన్నారు. శనివారం స్థానిక సత్యవరం జంక్షన్ నుంచి ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు.

విద్యారంగానికి మహర్దశ: ఎమ్మెల్యే


విద్యార్థులతో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం/రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో విద్యారంగానికి మహర్దశ పట్టిందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారరు. బొమ్మికలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో రూ.4.06 కోట్ల ఉపాధి నిధులతో తలపెట్టిన నూతన భవనాలు, అభివృద్ధి పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరంతర కృషితో ఉత్తమ విజయాలు సాధించాలని విద్యార్థినిలకు సూచించారు. అనంతరం వారితో సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. విశేషంగా ఆకట్టుకొన్నాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సేవలతో మంచిపేరు తెచ్చుకోండి

సేవలతో మంచిపేరు తెచ్చుకోవాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. స్థానిక శ్రీనీలమణిదుర్గ ఆలయ ఆవరణలో శనివారం జరిగిన నూతన పాలక మండలి ప్రమాణ స్వీకార మహోత్సవంలో ఆయన పాల్గొన్నారు. నూతన అధ్యక్షుడు అక్కంధ్ర సన్యాసిరావుకు, సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవో టి.వాసుదేవరావు, టీడీపీ నేతలు పైల బాబ్జీ, టి.తిరుపతిరావు, సైలాడ సతీష్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నియంత్రణ సామాజిక బాధ్యత

ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించడం సామాజిక బాధ్యత అని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. స్థానిక శ్రీనీలమణిదుర్గ ఆలయ ఆవరణలో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.ప్రసాదరావు , ఎంపీడీవో హెచ్‌వీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛాంధ్ర'లో భాగస్వాములు కావాలి


మొక్కలు నాటుతున్న జడ్పీ సీఈవో సత్యనారాయణ

వజ్రపుకొత్తూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని జడ్పీ సీఈవో డి.సత్యనారాయణ అన్నారు. శనివారం నగరపంల్లి హైస్కూల్‌లో స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులతో కలసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యలయంలో రికార్డులను పరిశీలించారు. తీరప్రాంతంలోని 11 పంచాయతీలలో ఉపాధి పథకం అమలు తీరుపై ఆరా తీశారు. డోకులపాడు సముద్ర తీరప్రాంతాన్ని పరిశీలించి... పర్యాటరంగం అభివృద్ధిపై ఎంపీడీవో ఎన్.రమేష్ నాయుడుతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్డీ తిరుమలరావు పాల్గొన్నారు.

పోలాకిలో...

పోలాకి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఖాళీ ప్రదేశాల్లో విరివిగా మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షణ బాధ్యతలను తీసుకోవాలని అధికారులకు జడ్పీ సీఈవో సత్యనారాయణ సూచించారు. శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గరిమెళ్ల రవికుమార్, మండల ప్రత్యేకాధికారి వెంకటమధు, తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, డెప్యూటీ ఎంపీడీఓ బి.పద్మావతి, సూపరింటెండెంట్ బలగ ప్రకాష్, ఎంఈఓలు శ్రీనివాసనాయక్, ఎస్.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎండల మల్లికార్జుని సన్నిధిలో

టెక్కలి రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రావివలస ఎండల మల్లికార్జున స్వామిని జడ్పీ సీవో డి.సత్యనారాయణ శనివారం దర్శించుకున్నారు. ఇటీవల ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దేవాలయం అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. కార్తీక మాసం వస్తున్నందు వల్ల రహదారి పనులు పూర్తి చేయాలని ఆలయ ఈవో జి.గురునాథరావుకు సూచించారు. ఆయనతో పాటు అర్చకులు యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రుక్మిణీ కల్యాణం


కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఎల్.ఎన్.పేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): శ్యామలాపురం ఆర్అండ్ఆర్ కాలనీలో వెలసిన రాధాకాంత స్వామి ఆలయంలో అర్చకులు పట్టిల రాధాకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో శనివారం రుక్మిణీ కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం తెల్లవారు జాము నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు జి.మోహనరావు, బి.గోవిందరావు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలలో పూర్తి స్థాయిలో వైద్య సేవలు

వజ్రపుకొత్తూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వైద్యులు సమ్మెలో ఉన్నప్పటికీ ఏరియా వైద్యులతో పీహెచ్‌సీలలో సేవలు అందిస్తున్నామని డీఎంఅండ్‌హెచ్‌వో ఎ.అనిత అన్నారు. శనివారం వజ్రపుకొత్తూరు పీహెచ్‌సీని ఆమె సందర్శించారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో మాట్లాడారు. వజ్రపుకొత్తూరులో ఆయుష్ సేవలు కూడా అందిస్తున్నట్టు చెప్పారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ప్రతి పీహెచ్‌సీని సందర్శించి సిబ్బందితో మాట్లాడి వైద్యసేవలు అందించే విధంగా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఈశ్వరమ్మ, చక్రధర్, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు బజారు కోసం సంతకాల సేకరణ

కాశీబుగ్గ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పలాస కేంద్రంగా రైతు బజారు ఏర్పాటు చేయాని కోరుతూ సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు అజయ్‌కుమార్, కృష్ణారావు మాట్లాడుతూ పలాసలో రైతు బజారు కావాలనేది ప్రజల చిరకాల కోరికగా మిగిలిపోయిందని అన్నారు. దీని కోసం జరిగే ఆందోళనకు అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు ప్రజల నుంచి సంతకాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో రాజు, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

నదిలో స్నానాలకు మార్గం సుగమం


రహదారి పనులు చేస్తున్న దృశ్యం

మెళియాపుట్టి, అక్టోబరు 18 (ఆంధ్ర జ్యోతి): కార్తీక మాసంలో భక్తులు అధిక సంఖ్యలో మహేంద్ర తనయలో నదీ స్నానాలు ఆచరిస్తుంటారు. అయితే మండలంలోని నదీ తీరంలో స్నానాలకు అనువుగాల లేకుండా పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. దీంతో టీడీపీ నాయకులు స్పందించి శనివారం పిచ్చిమొక్కలను తొలగించారు. దీంతో భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల టీడీపీ అధ్యక్షులు అనపాన రాజశేఖరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దీపావళి సందడి ప్రారంభం


జనుము పుల్లలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

నందిగాం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలో దీపావళి సందడి ప్రారంభమైంది. సోమవారం దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని మార్కెట్‌లో జనుము పుల్లలు, చెరుకులు, ప్రమిదలు తదితర సామగ్రి విక్రయాలు మొదలయ్యాయి. తొలిసారి నందిగాంలో ఆదివారం నుంచి బాణసంచా విక్రయాలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన


దీపం ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

పలాస రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక సత్యసాయి విద్యావిహార్ విద్యార్థులు దీపం ఆకారంలో కూర్చున్న దృశ్యం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పాఠశాల ట్రస్టు చైర్మన్ మల్లా రామేశ్వరరావు మాట్లాడుతూ దీపావళి విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి


సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మెళియాపుట్టి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను ప్లాస్టిక్ రహితంగా తయారు చేసుకోవాల్సిన అవసరం ఉందని ఎంపీడీవో ప్రసాద్‌పండా తెలిపారు. శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పరమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహనకే సదస్సులు


మాట్లాడుతున్న న్యాయాధికారి కిషోర్ బాబు

హరిపురం, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): సామాన్యులకు చట్టాలపై అవగాహన కల్పించడమే ప్రధాన ధ్యేయంగా న్యాయ విజ్ఞాన సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్టు సోంపేట కోర్టు ఆరో అదనపు జిల్లా న్యాయాధికారి కె.కిషోర్‌బాబు తెలిపారు. మందస మండలం ఏజెన్సీ ప్రాంతంలోని పెట్టువా గ్రామంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది మడ్డు సర్వేశ్వరరావు, వై.కృష్ణమోహన్, ఎంసీహెచ్ శ్రీనివాసరావు, కె.రాజు, జగదీష్, ట్రైనీ ఎస్ఐ వెంకటేష్ పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోండి

జలుమూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగపరచుకోవాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. చల్లవానిపేటలో జెమ్స్ ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, మండల పార్టీ అధ్యక్షులు వెలమల రాజేంద్రనాయుడు, సర్పంచ్ పంచిరెడ్డి రామచంద్రరావు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

దాడి యత్నం దారుణం

పలాసరూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయిపై దాడి యత్నాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలని పలాస నియోజకవర్గ ఎంఆర్‌పీఎస్ నాయకులు అన్నారు. నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇన్‌చార్జి తహసీల్దార్ గిరికి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు టి.కృష్ణారావు, ఎం.జోగారావు, లోకనాథం, రాజు ఈశ్వర్ పాల్గొన్నారు.

సొంత నిధులతో రహదారికి మరమ్మతులు


పనులు చేయిస్తున్న కృష్ణ

హిరమండలం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): హిరమండలానికి చెందిన టీడీపీ నాయకులు లాడె కృష్ణ తన సొంత నిధులతో అలికాం-బత్తిలి ప్రధాన రహదారికి మరమ్మతులు చేయించారు. పాత గ్రామీణ బ్యాంకు ఎదురుగా రహదారిపై పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. వీటి కారణంగా తరుచూ వాహన చోదకులు ప్రమాదాలకు గురతున్నారు. ఇటీవల ఒక ఆటో రహదారిపై బోల్తా పడింది. ఈ సంఘటనపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం వెలువడింది. దీనికి లాడే కృష్ణ స్పందించి తన సొంత నిధులతో శనివారం రహదారికి మరమ్మతులు చేయించారు.

కార్గో ఎయిర్‌పోర్ట్ వద్దు

పలాస రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పచ్చని పొలాల్లో కార్గో ఎయిర్‌పోర్టు నిర్మాణం చేయవద్దని వివిధ ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పలాస మండలం మాకన్నపల్లిలో రాజగురు, సుఖదేవ్, భగత్‌సింగ్ విగ్రహాల వద్ద శనివారం కార్గో ఎయిర్‌పోర్టు నిర్మాణం చేయకూడదని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 24న విజయవాడ గాంధీ నగర్‌లో కార్గోఎయిర్ పోర్టు నిలుపుదల చేయాలని సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ మేరకు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎం జిల్లా కార్యదర్శి ఎస్.వీరాస్వామి, పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు పత్రి దానేసు, సభ్యులు స్వామినాథం, పీకెఎస్ జిల్లా అధ్యక్షులు ఎం.ధర్మారావు, జిల్లా కార్యదర్శి పి.దుర్యోధన, ఎం.గంగయ్య, డి.లక్ష్మణ్ పాల్గొన్నారు.

బాణసంచాను అక్రమంగా నిల్వ చేయొద్దు

కొత్తూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): బాణసంచాను అక్రమంగా నిల్వ ఉంచితే కఠిన చర్యలు తప్పవని సీఐ సీహెచ్ ప్రసాద్ హెచ్చరించారు. దీపావళి సందర్భంగా మందుగుండు సామన్లు అమ్మకాలు చేసేందుకు ఎవరికీ అనుమతులు ఇవ్వలేదని శనివారం తెలిపారు. ఒడిశా నుంచి అక్రమంగా మందుగుండు సామాన్లు రవాణా చేసినా... అమ్మకాలు సాగించినా కేసులు నమోదు చేస్తామని అన్నారు.

విక్రయాలకు అనుమతి

పోలాకి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): బాణసంచా విక్రయాలకు పోలాకి మండలంలో మూడు షాపులను అనుమతి ఇచ్చినట్టు ఎస్ఐ జి.రంజిత్ తెలిపారు. శనివారం ఆయన బెలమర, పోలాకి ప్రాంతాల్లో పర్యటించారు. బెలమరలో రెండు, పోలాకిలో ఒకషాపునకు అనుమతి లభించిందన్నారు. అనుమతిలేకుండా విక్రయాలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పేదలకు న్యాయసేవలు అందించాలి

● జిల్లా ప్రధాన న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం లీగల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పేద ప్రజ లకు న్యాయ సేవలు అందించడంలో భాగస్వామ్యం కావాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా అన్నా రు. జిల్లాలో ఎంపిక చేసిన పారా లీగల్ వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం ముగింపు శనివారం స్థానిక న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయ న వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో 1వ అదనపు జిల్లా న్యాయాధికారి పి.భాస్కరరావు, జిల్లా అదనపు న్యాయాధికారులు సీహెచ్ వివేకానంద శ్రీనివాస్, ఎస్ఎం ఫణికుమార్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎం.శ్రీధర్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి కె.అనురాగ్, జూనియర్ అదనపు న్యాయాధికారి జమారుత్ బేగం కమాలుద్దీన్, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆరోపణలు అవాస్తవం: ఎమ్మెల్యే రవికుమార్



ఆమదాలవలస, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కొన్ని పత్రికలు, చానళ్లలో తనపై కథనాలు వచ్చాయని, అవి పూర్తిగా అవాస్తవమని ఎమ్మెల్యే కూన రవికుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. సదరు పాత్రికేయులు వ్యక్తిగత కక్షతో బాధితులను పురిగొల్పి తనపై తప్పుడు ఆరోపణలు చేయించారన్నారు. ఇటీవల కొత్తరోడ్డు వద్ద జరిగిన ఓ ప్రైవేటు సంఘటనలో తన ప్రమేయం లేదని, అయినా తనపై ఆరోపణలు చేయడం దారుణమన్నారు. ఈ ఘటనపై బాధితురాలు, ఆమె కుటుంబ సభ్యులకు తన సానుభూతిని తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు పై పోలీసు అధికారులు సమగ్ర విచారణ చేసి సంబంధిత వ్యక్తులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఎటువంటి గ్యాంగులు లేవని, తన బలం ప్రజలేనని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రజలకు చేరవేయడమే ప్రథమ కర్తవ్య మన్నారు.

వామ్మో.. ఇవన్నీ కొంగలే..!



సందడి చేస్తున్న తెలుపు-నలుపు కొంగలు

సోంపేట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారం తెల్ల, నల్ల కొంగలు కనువిందు చేశాయి. స్థానిక సంస్కార భారతి కళాశాల ఆవరణలో సాయంత్రం తెలుపు, నలుపు రంగుల్లో కొంగలు సందడి చేశాయి. వీటిని చూసిన స్థానికులు తన మొబైళ్లలో బంధించి ఆనందం పొందారు.

ప్రణాళికాబద్ధంగా చదివి లక్ష్యం చేరుకోవాలి



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

ఎచ్చెర్ల, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రణాళికాబద్ధంగా చదువుకుని లక్ష్యాన్ని చేరుకోవాలని శ్రీశివానీ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్య ప్రతినిధులు వీఎం సాయినాథ రెడ్డి, కె.దుర్గాశ్రీనివాస్, పి.దుర్గా ప్రసా ద్‌రాజు అన్నారు. శనివారం కళాశాలలో ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సాంకేతిక నైపుణ్యాన్ని ఆకళింపు చేసుకుని ముందుకు సాగితే ఉజ్వల భవిత ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వివిధ క్రీడా పోటీలు నిర్వ హించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జీటీ చంద్రశేఖర్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్వీఎన్ సునీల్‌కుమార్, ఫార్మసీ ప్రిన్సిపాల్ రాజకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా ధరలు పేలుతున్నాయ్

(ఏడో పేజీ తరువాయి)

కొనుగోలుదారులకు ఇస్తున్నారు. బిల్లుపై వస్తువు ధర ముద్రణ లేకుండా కొనుగోలుదారులకు మోసం చేస్తున్నారు. కనీసం రూ.2వేలు తీసుకెళితే తప్ప బాణసంచా సామగ్రి వచ్చే పరిస్థితి లేదని వినియోగదారులు పేర్కొంటున్నారు.

తాత్కాలిక షాపులకు అనుమతి..

జిల్లాలో శ్రీకాకుళం, పలాస, ఇచ్ఛాపురం ప్రాంతాల్లో మాత్రమే అధికారికంగా అనుమతులు కలిగిన షాపులు ఉన్నాయి. కానీ ప్రతి పట్టణానికి, మండలానికి అనధికారికంగా బాణసంచా సామగ్రి చేరింది. జిల్లాలో 12మంది ఏడాది పొడవునా బాణాసంచా తయారు చేసే లైసెన్స్‌లు కలిగి ఉన్నారు. వీరు ఆర్డర్‌పై మాత్రమే బాణసంచా తయారు చేసి విక్రయించాలి. దుకాణాలకు అమ్మకూడదు. అయితే జిల్లావ్యాప్తంగా ఆదివారం, సోమవారం విక్రయించుకొనేందుకు వీలుగా 50కిపైగా షాపులకు తాత్కాలిక అనుమతులు ఇచ్చారు. శ్రీకాకుళం నగరానికి సంబంధించి 22 షాపులకు అనుమతి ఇచ్చారు. ఆర్ట్స్ కాలేజ్ మైదానంలో తాత్కాలిక దుకాణాలు ఏర్పాటవుతున్నాయి.

నలుగురైదుగురు కలిసి..

జిల్లావ్యాప్తంగా మండల కేంద్రాల్లో బాణాసంచా స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నారు. స్థానిక రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక శాఖల అనుమతులతో కొంతమంది రిటైల్ వ్యాపారులు దుకాణాలకు అనుమతులు తీసుకొని వాటికి వేలం నిర్వహించి వ్యాపారులకు కేటాయిస్తున్నారు. ఒక్కో స్టాల్ ఖరీదు రూ.5లక్షల నుంచి రూ.10లక్షలు వరకు ఉంది. నలుగురైదుగురు వ్యాపారులు కలిసి ఓ స్టాల్‌ను నిర్వహిస్తున్నారు. వ్యాపారం పూర్తయ్యాక వీరంతా లాభాలను పంచుకుంటారు. జిల్లాలో ముగ్గురికి మాత్రమే బాణాసంచా విక్రయాలకు శాశ్వత లైసెన్స్ ఉంది. వీరు తప్ప ఎవరూ అమ్మకాలు సాగించేందుకు వీలులేదు. కానీ తాత్కాలిక షాపుల పేరిట అధికారులు అనుమతులు మంజూరు చేస్తున్నారు. వారు రెండు రోజులపాటు బాణసంచా విక్రయించుకోవచ్చు. అయితే జనావాసాల మధ్య, జాతీయ రహదారుల చెంతనే తాత్కాలిక షాపులు ఏర్పాటు చేస్తుండడంపై కొన్నిచోట్ల అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.

అక్రమ క్వారీల్లో హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

పొందూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అనుమతులేకుండా నిర్వహిస్తున్న క్వారీల్లో శనివారం రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఇటీవల జిల్లాలో పలు కారణాలతో క్వారీలలో ప్రమా దాలు చోటుచేసుకుంటుండడంతో కలెక్టర్ ఆదేశాలతో అక్రమ క్వారీలను గుర్తించి హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దార్ ఆర్.వెంకటేష్ తెలిపారు. శనివారం రాపాక పంచాయతీ ఇల్లయ్య గారి పేట, రాపాక పంచాయతీ గారపేటల్లో ఉన్న క్వారీల్లో బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. అనంతరం క్వారీ నిర్వాహకులతో కార్యాలయంలో సమా వేశం నిర్వహించారు. క్వారీ నిర్వహణకు అనుమతులు తప్పనిసరని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్ఐ వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

ముందస్తు దీపావళి సంబరాలు



ఓంకారంలో దీపాలు

సోంపేట/ఇచ్ఛాపురం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): లక్కవరం ఎంపీపీ పాఠశాలలో శనివారం ముందస్తు దీపావళి సంబరాలు నిర్వహించారు. ఓంకారంలో దీపాలు పెట్టి లక్ష్మీదేవి పటానికి పూలమాల వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీపావళి ప్రత్యేకతను హెచ్ఎం ఎస్.కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు వివరించారు.

● ఇచ్ఛాపురం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): బలరాంపురం ప్రాథమికోన్నత, పాఠశాల మున్సిపల్ పంజావీధి ప్రాథమిక పాఠశాలల్లోనూ ముందస్తు దీపావళి వేడుకలు నిర్వహించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



శ్రీకాకుళం రూరల్: సైకిల్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం రూరల్, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర, జీఎస్టీ తగ్గింపుపై అవగాహనకు శనివారం రాగోలు గ్రామంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కలను పెంచాలన్నారు. జీఎస్టీపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. రాగోలు ప్రధాన రహదారిపై మొక్కలు నాటారు. కార్య క్రమంలో తహసీల్దార్ ఎం.గణపతి, ఎంపీడీవో వి.ప్రకాష్ రావు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

కాలుష్య నివారణకు సహకరించాలి



కలెక్టరేట్: కాలుష్య నివారణపై ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆర్డీవో ఎం.వేంకటేశ్వరరావు అన్నారు. స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం బ్యాటరీ బైక్‌ల విని యోగంపై కలెక్టరేట్ సిబ్బందికి అవగాహన కలిగించారు. ఎంవీఐ పీవీ గంగాధర్ మాట్లాడుతూ.. బ్యాటరీ వాహనాలతో పొల్యూషన్ ఉండదని వీటితో వావరణం ప్రభావితం కాదన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రపై డిప్యూటీ కలెక్టర్ పద్మావతి ప్రతిజ్ఞ చేయించారు. కలెక్టరేట్ ఏవో జీఏ సూర్యనారాయణ, పలు విభాగాల పర్యవేక్షకులు రామ మూర్తి, సురేష్, రామకృష్ణ, పాల్గొన్నారు.

బీఆర్ఏయూలో..

ఎచ్చెర్ల, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. పిచ్చి మొక్కలు తొలగింపు, పరిసరాల పరిశుభ్రత తదితర కార్యక్రమాలు చేప ట్టారు. కాలుష్య రహితంగా దీపావళి చేపట్టేందుకు విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.అనూరాధ, స్వచ్ఛ ఆంధ్ర క్యాంపస్ నోడల్ అధికారి డాక్టర్ డి.చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుతో ఆరోగ్యకర సమాజం

కవిటి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పారిశుధ్యం మెరుగుపరచుకోవడంతో ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని ఎంపీడీవో ఎల్.త్రినాథ్ అన్నారు. కవిటిలో శనివారం ప్రభుత్వ కార్యాలయాల వద్ద స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. పభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏవో శ్రీనివాసరెడ్డి, ఉపాధి వేతనదారులు పాల్గొన్నారు.



కవిటిలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ఉపాధి వేతనదారులు

న్యూస్ బాక్స్

బాణసంచా విక్రయాలకు అనుమతి తప్పనిసరి

కంచిలి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బాణసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరని, అనుమతు లు లేకుండా అమ్మకాలు చేపడితే చట్టపరమైన చర్యలు తప్పవని తహసీల్దార్ ఎన్.రమేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అనుమతులు లేకుండా అమ్మకాలు జరిపినా, అనుమతులకు మించి నిల్వలు కలిగి ఉన్నా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

బడిబయట పిల్లలు బడిలో..

కంచిలి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బడికి వెళ్ళకుండా ఉన్న ఇద్దరు చిన్నారులను ఎంఈవో శివరాంప్రసాద్ చొరవతో చొట్రాయిపురం పాఠశాలలో చేర్పించారు. గ్రామ సమీపంలోని కొండపై చిన్నారుల తల్లిదండ్రులు పాములు పట్టుకుని జీవనం సాగిస్తున్నారు. ఈనేపథ్యంలో పిల్లలు పాఠశాలకు వెళ్లకుండా ఇంటివద్దనే ఉంటున్న సమాచారం తెలుసుకున్న హెచ్ఎం మడ్డు తిరుపతిరావు ఈ విషయాన్ని ఎంఈవో దృష్టికి తీసుకువెళ్లారు. ఎంఈవో చిన్నారుల తల్లిదండ్రుల వద్దకు వెళ్లి అవగాహన కలిగించి ఒప్పిం చారు. ఈ నేపథ్యంలో కుమారుడిని పాఠశాలకు, కుమార్తెకు అంగన్వాడీ కేంద్రంలో చేర్పించేందుకు శనివారం తీసుకువచ్చారు.

ఐవీఆర్ఎస్‌పై అవగాహన

కంచిలి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): గొల్లకంచిలిలో ఐవీఆర్ఎస్, సాసా (ఎస్ఏఎస్ఏ)పై గ్రామస్థులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఎల్‌పీవో ఐవీరమణ వివిధ అంశాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ లండలక్ష్మి, టీడీపీ నాయకులు బంగారు కురయ్య, లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలో 9 మంది ఎంపిక

ఆమదాలవలస, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): దన్నానపేట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ విభాగానికి చెందిన 9 మంది విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూలో ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ బి.జానకి రామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెం దిన మేథ సర్వో డ్రైవ్స్ కంపెనీ నిర్వహించిన క్యాంపస్ పరీక్షల్లో జె.అపర్ణ, డి.సాయి కార్తీక్‌రెడ్డి, మణిబాబు, వి.గణేష్, టి.పద్మలిఖిత, బి.నందిని, కె.వెంకటరాజు, పి.అనిల్, పి.చరణ్ ఎంపికయ్యారన్నారు. వారిని అభినందించారు.

కొండచిలువ హతం

సోంపేట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని బీల ప్రాంతం వ్యవసాయ భూముల్లో కూలీలు కలుపు తీస్తుండగా సుమారు 9 అడుగుల కొండచిలువ అకస్మాత్తుగా దూసుకు వచ్చింది. దీనిని చూసిన కూలీలు పరుగులు తీయడంతో అక్కడ ఉన్న కొంతమంది కర్రలతో కొట్టడంతో మృతి చెందింది.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

ఇచ్ఛాపురం అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి పోటీలకు ఈదుపురం పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం బి.ఉమామహేశ్వరి తెలిపారు. అండర్- 17 విభాగం త్రోబాల్‌లో కృష్ణదాస్, స్విమ్మింగ్‌లో సోమేష్‌బెహరా, అండర్-14 విభాగం స్విమ్మింగ్‌లో మహా లక్ష్మి బెహరా ఎంపికయ్యారన్నారు. ఈ మేరకు శనివారం పాఠశాలలో వారిని అభినందించారు.

రూ.6 లక్షల బాణసంచా స్వాధీనం

కంచిలి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అనుమతికి మించి నిల్వ ఉంచిన బాణసంచా సామగ్రిని స్వాధీ నం చేసుకున్నట్లు ఎస్ఐ పి.పారినాయుడు తెలిపారు. జాడుపూడి, బలియాపుట్టుగ, అంపురం గ్రామాల్లో బాణసంచా అమ్మకాలకు అనుమతులు పొందిన దుకాణాలను శుక్రవారం రాత్రి తనిఖీ చేశారు. అనుమతులకు మించి నిల్వ ఉండడంతో తెలుకల వైకుంఠరావు దుకాణంలో రూ.2,69,470 విలువ చేసే మందుగుండు సామాన్లు, సుంకర మణికంఠ వద్ద రూ.1,71,900 విలువ చేసే సరకులు, దూపాన సునీల్ దుకాణంలో 1,16,497, దూపాన శ్రీనివాసరెడ్డి దుకాణంలో రూ.1,15,300 విలువ చేసే మందుగుండు సామాన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటన్నింటి విలువ సుమారు 6,73,167లు ఉంటుందన్నారు.

సమస్యలను తక్షణమే పరిష్కరించాలి: అశోక్



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే బెందాళం అశోక్

కవిటి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలో రెవెన్యూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బి.అశోక్ ఆదేశించారు. రామయ్యపుట్టుగలో శనివారం మండల రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రీ సర్వే వల్ల రైతుల భూముల వివరాలు నమోదులో తప్పి దాలతో ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. మ్యుటేషన్ల కోసం వచ్చే వారికి పనులు వేగవంతంగా చేయాలన్నారు. సమీక్షలో తహసీల్దార్ కె.మురళీమోహన్‌రావు, డీటీ కృష్ణమూర్తి, ఆర్ఐ లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ మంజూరు చేయాలని వినతి

ఇచ్ఛాపురం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ప్రభుత్వ ఐటీఐ మంజూరు చేయాలని, కంప్యూటర్ నైపుణ్య శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర బీసీ సాధికార సమితి కన్వీనర్ కొండా శంకర్ రెడ్డి, పలువురు విశ్రాంత ఉపాధ్యాయులు కోరారు. ఈ మేరకు శనివారం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఇచ్ఛాపురం నియోజకవర్గం జిల్లాకు చివరన ఉన్నందున విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సి వస్తోందని, అందువల్ల ఇచ్ఛా పురంలోనే పారిశ్రామిక శిక్షణ కేంద్రాలను ఏర్పాటు అవసరమన్నారు. తగుచర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు కేశవరావు, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను తొలగించాలని నిరసన



నిరసన తెలుపుతున్న బీసీ సంఘ నేతలు

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఇంటి స్థలానికి సంబంధించిన ధ్రువపత్రాల కోసం వెళితే అవమా నకరంగా ప్రవర్తించిన కొత్తూరు తహసీల్దారుపై చర్యలు తీసుకోవాలని, తక్షణం విధుల నుంచి తొలగించాలని కొత్తూరు మండలం బలద గ్రామానికి చెందిన అరుబోలు కమల జిల్లా బీసీ సంక్షేమ సంఘ నాయకులతో కలిసి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్‌కుమార్ మాట్లాడుతూ భర్తను కోల్పోయిన మహిళ నుంచి తహసీల్దార్ లంచం అడిగారని, ఇవ్వలేని స్థితిలో ఉన్న మహిళతో అసభ్యకరంగా మాట్లాడి వేధింపులకు గురిచేయడం దారుణమన్నారు. తక్షణం విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకుని బాధితురాలికి న్యాయం చేయాలని కోరారు. అనంతరం డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తూర్పుకాపు సంక్షేమ సంఘ నాయకులు పి.కన్నంనాయుడు, బూర్ల అప్పారావు, కవిటి దేవరాజ్, కె.శ్రీనివాసరావు, జి.వెంకటరావు పాల్గొన్నారు.

సిక్కోలు ఉత్సవ్ విజయవంతం



రంగవల్లికను తీర్చిదిద్దుతున్న మహిళలు



జోష్ శివ బృందం డ్యాన్స్

అరసవల్లి/గుజరాతీపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ మున్సిపల్ మైదానంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ ఎగ్జిబిషన్, సేల్‌తో పాటు వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. శనివారం రఘుపాత్రుని శ్రీకాంత్ శిష్య బృందంచే పలు నృత్య ప్రదర్శనలు, నృత్య రూపకాలు ఆకట్టుకున్నాయి. అలాగే డీఆర్‌డీఏ సిబ్బందిచే జీఎస్టీపై అవగాహన రూపకం ఆకట్టుకుంది. కదిరెడి నరసింహుడు, కోలాటం, జోష్ శివ డ్యాన్స్ బృందం నృత్యాలు, కర్రసాము, కోలాటం, లేజర్‌షో ఆకట్టుకున్నాయి. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాంత్ బృందంచే శ్రీనివాస కల్యాణంలో ఓ ఘట్టం

నెలాఖరులోగా క్విజ్ పోటీలకు పేర్లు నమోదు

ఎచ్చెర్ల, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న యువన నాయ కుల ప్రసంగ (క్విజ్) పోటీలకు విద్యార్థులు పేర్లను ఈనెలాఖరులోగా ఆన్‌లైన్‌లో నమోదుచేసు కోవాలని ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.ముకుందరావు కోరారు. దేశ వ్యాప్తంగా జరుగుతున్న ఈ క్విజ్ పోటీల్లో ఆసక్తి గల విద్యార్థులంతా పాల్గొనాలన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపి న విద్యార్థులు దేశ ప్రధాని నరేంద్ర మోదీని కలుసుకునే అవకాశం ఉందన్నారు. డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

సోలార్‌తో విద్యుత్ ఆదా

ఇచ్ఛాపురం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): సోలార్‌ను ఉపయోగించుకోవడం ద్వారా విద్యుత్ ఖర్చులు తగ్గుతాయని ట్రాన్స్‌కో డీఈఈ ఎం.నిరంజన్‌బాబు అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సోలార్ వాడకంపై ప్రజలకు అవగాహన కలిగించారు. జీఎస్టీ రేట్లు తగ్గడం వల్ల సోలార్ రేట్లు బాగా తగ్గుముఖం పట్టాయని ప్రభుత్వం కూడా సబ్సిడీపై సోలార్ అందిస్తుందని, దీనిని వినియోగించు కోవాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభాకరరావు, ఏఈ గోవిందరావు, సోంపేట ఏఈ రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యంతో ప్రయోజనం

గార, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి సేద్యం ద్వారా పంటలు సాగుచేయడం వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని రైతు శాస్త్రవేత్త చౌదరి పద్మజ అన్నారు. శనివారం కరణాలపేటలో ప్రకృతి సేద్యం పంట పొలంలో సంబంధిత సిబ్బందికి అవగాహన కల్పించారు. ప్రకృతి సేద్యం వల్ల నేలలో తేమశాతం, మిత్ర పురుగులు శాతం దుబ్బులు పిలకలు గుర్తించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జీవైఆర్ఎఫ్ వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్ స్థల పరిశీలన

సోంపేట రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సోంపేట మేజర్ పంచాయతీ మొగలి కొత్తూరులో ఏర్పాటు చేయనున్న ప్రభుత్వ పెట్రోల్ బంకు కోసం స్థలాన్ని శనివారం రాత్రి పలాస ఆర్డీవో వెంకటేష్ పరిశీలించారు. అంతకుముందు ఇసుకలపాలెం మత్స్యకార గ్రామంలో అదే గ్రామానికి చెందిన గంగమ్మ ఆక్రమించిన పాఠశాల ఆట స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ మహేష్, సర్వేయర్ పాల్గొన్నారు.

ఆదిత్యాలయంలో టెండర్లు ఖరారు

అరసవల్లి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): అరసవల్లి సూర్య నారాయణ స్వామి దేవస్థానంలో వివిధ అంశాలకు సంబంధించి శనివారం ఈవో కేఎన్‌వీడీవీ ప్రసాద్, ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో టెండర్ ప్రక్రియ చేపట్టి ఆమోదించారు. తెప్పోత్సవానికి సంబంధించిన లైటింగ్, స్టేజీల ఏర్పాటుకు, షెడ్లు, నావకు పుష్పాలంకరణ, ప్లంబింగ్ ఐటెమ్స్, ఇతర పనులకు టెండర్లు ఖరారైనట్లు ఈవో తెలిపారు. కార్యక్రమంలో గ్రేడ్-2 ఈవో సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.